ఎస్ఎస్‌సీటీయూలో స్పాట్ అడ్మిషన్లు

అక్టోబర్ 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాయదుర్గం: ములుగులోని సమ్మక్కసారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెంటర్ యూనివర్సిటీగా వ్యవహరిస్తున్నందున హెచ్‌సీయూ అధికారులు ఒక ప్రకటనను సోమవారం విడుదల చేశారు.2024–25 విద్యాసంవత్సరం బీఏ (హానర్స్) ఇంగ్లిష్‌లో జనరల్ సీట్లు 9, ఎస్సీ–4, ఎస్టీ–2, ఓబీసీ 7, ఈడబ్ల్యూఎస్–2, మొత్తం 24 సీట్లు, బీఏ (హానర్స్) ఎకనామిక్స్‌లో జనరల్ సీట్లు 8, ఎస్సీ 4, ఎస్టీ 2, ఓబీసీ 7, ఈడబ్ల్యూఎస్–2, మొత్తం 23 సీట్లు ఖాళీగా ఉన్నాయి. స్పాట్ అడ్మిషన్లను ఎస్ఎస్‌సీటీయూలోని యూత్ ట్రెనింగ్ సెంటర్ భవనంలో అక్టోబర్ 3వ తేదీన ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తారు.స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు,టీ సీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, మెడికల్ డిక్లరేషన్ అఫిడవిట్, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ఎన్‌సీఎల్/ఈడబ్లూఎస్/పీడబ్ల్యూడీ/డీపీ సర్టిఫికెట్లు, దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తును సమర్థ్ పోర్టల్‌లో పూర్తి చేయాలి. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ అధికారులు కోరారు.

రాష్ట్రస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ మధుసూదన్


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి. మధుసూదన్

మియాపూర్: ఈ నెల 28న వరంగల్‌లో జరగనున్న ఏఐఎఫ్‌డివై రాష్ట్రస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌డివై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి. మధుసూదన్ అన్నారు. స్టాలిన్‌నగర్‌లో రాష్ట్రస్థాయి సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...వరంగల్‌లో రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్రంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి భారీగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువతుల విభాగం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కన్వీనర్ ఎండి. సుల్తానాబేగం, కన్వీనర్, కమిటీ సభ్యులు డి.కీర్తి, దశరథ్ నాయక్, శ్రీనివాసులు, కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి..4 వినతులు

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 వినతి పత్రాలు అందగా అవి రెవెన్యూ విభాగానికి సంబంధించినవి కావడంతో సమస్య పరిష్కరించాలని అధికారులను డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు.

ఉద్యోగం కోసం వినతి..

చందానగర్ సర్కిల్ 21 పరిధిలో పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో 2..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు రెండు ఫిర్యాదులు అందజేశారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు వివరించారు. ఏఎంసీ శ్రవణ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


డీసీ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ కార్యదర్శి కృష్ణ


శేరిలింగంపల్లి సర్కిల్‌లో .. డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి

పెరిగిన శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి

- విలీన పంచాయతీల రికార్డులు స్వాధీనం
- వార్డు కార్యాలయాలుగా బోర్డులు


కార్యదర్శుల నుంచి రికార్డులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

శంషాబాద్: ఇటీవల ప్రభుత్వ ఆర్డినెన్స్ ద్వారా శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన 6 గ్రామ పంచాయతీల రికార్డుల స్వాధీన ప్రక్రియను సోమవారం అధికారులు పూర్తి చేశారు. శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, మేనేజర్ శ్రావణి తదితరులు ఉదయం నుంచి చిన్నగొల్కొండ, పెద్ద గొల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘాన్సిమియాగూడ, బహదూర్‌గూడ గ్రామపంచాయతీల కార్యదర్శులు పంచాయతీ రికార్డులను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయాలకు వెంటనే శంషాబాద్ పురపాలక సంఘం వార్డు కార్యాలయాలుగా బోర్డులు ఏర్పాటు చేశారు. రాత్రి వరకు రికార్డుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది.

2019లో మున్సిపాలిటీగా..

శంషాబాద్ మున్సిపాలిటీ 2019 మార్చి నెలలో ఏర్పడింది. శంషాబాద్ మేజర్ గ్రామ పంచాయతీతో పాటు సమీపంలో ఉన్న గొల్లపల్లి, ఊట్‌పల్లి, తొండుపల్లి, కొత్వాల్‌గూడ, సాతంరాయి గ్రామాలతో మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. తొలుత 3 గ్రామాలైన తొండుపల్లి, ఊట్‌పల్లి, గొల్లపల్లిలో మున్సిపాలిటీ ప్రారంభమైంది. శంషాబాద్ మేజర్ పంచాయతీకి మరో నెల గడువు ఉండడంతో ఏప్రిల్ నెలలో దానిని విలీనం చేసుకున్న అనంతరం మే నెలలో పంచాయతీలుగా గడువు ముగిసిన కొత్వాల్‌గూడ, సాతంరాయిలతో కలిపి పూర్తిస్థాయి మున్సిపాలిటీ ఏర్పడింది. 2020లో మున్సిపాలిటీ ఎన్నికలతో తొలి పాలకవర్గం ఏర్పడింది. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మరో 6 గ్రామ పంచాయతీల విలీనంతో మున్సిపాలిటీ విస్తీర్ణంతో పాటు ఓట్ల సంఖ్య కూడా పెరిగింది. దీంతో విలీన గ్రామాలకు సంబంధించిన పాలన మంగళవారం నుంచి మున్సిపాలిటీ ఆధీనంలోకి రానుంది.



ఇటీవల కురిసిన వర్షాలకు లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వరదనీరు (ఫైల్)

అండర్ బ్రిడ్జి.. అవస్థలు తప్పేదెలా ?

బాక్స్‌టైప్ డ్రెయిన్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో.. ● లింగంపల్లి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేనా.. అనే ప్రశ్న తలెత్తుతోంది. వరద సమస్య పరిష్కారానికి రూ. 4 కోట్లు నిధులతో బాక్స్‌టైప్ కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రెయిన్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. కానీ దీనికి ఫ్లైఓవర్‌తోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. రూ.కోట్లు వ్యయం చేసి పనులు చేపట్టినా సమస్య మాత్రం కొలిక్కి రాలేదు. లింగంపల్లి, పటాన్‌చెరు, ఆర్‌సీపురం, చందానగర్ తదితర ప్రాంతాలతో పాటు చేరువలోని కాలనీలు, బస్తీల నుంచి గచ్చిబౌలి వెళ్లాలంటే దశాబ్దాలుగా ఇదే ప్రధాన రహదారిగా ఉంది. కానీ ప్రతియేటా వర్షాకాలం వచ్చిందంటే జూన్ నుంచి నవంబర్ వరకు అండర్‌బ్రిడ్జి నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోవడం, మళ్లించడం ఏటా జరిగే తంతే. నిధులు మంజూరై పనులు ప్రారంభమవడం.. 3 నెలల్లో పనులు పూర్తి చేస్తామన్న అధికారులు ఇప్పటి వరకు బాక్స్‌టైప్ కల్వర్టు పూర్తి చేయగలిగారు. ప్రస్తుతం బాక్స్ టైప్ డ్రెయిన్ పనులు పూర్తి కాకపోవడంతో సమస్య యథావిధిగానే ఉంది.

పనులు పూర్తయితేనే..

- బాక్స్‌టైప్ డ్రెయిన్ నిర్మాణంతో చాలా వరకు వరద నీరు సాఫీగా నాలాలోకి వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది
- శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందున్న రెండు రోడ్లు, చాకలి చెరువు ద్వారా వచ్చే వరద నీరంతా డ్రెయిన్‌లోకి వెళ్లేలా చూడాలి
- అండర్‌బ్రిడ్జి వద్ద ఎలాంటి చర్యలు చేపట్టినా సమస్య పూర్తిగా తీరదని పలువురు అభిప్రాయపడుతున్నారు.
- అండర్‌బ్రిడ్జిపై ఫ్లైఓవర్ నిర్మిస్తేనే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని వాహనదారులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.
- ఆ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

25న వాహనాల వేలం..

ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసుల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ ఆదేశాల మేరకు పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో 25వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ... వేలంలో పాల్గొనే వారు నిర్ణీత ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

నివాళి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమకారుడు, శేరిలింగంపల్లి మాజీ ఇన్‌చార్జీ కొండకల్ శంకర్‌గౌడ్‌కు సోమవారం నివాళులు అర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించారు. నాయకులు దారుగుపల్లి నరేష్, రమేష్‌గౌడ్, అంజమ్మ, అనిల్‌సింగ్, తిరుమలేష్, ఖాదర్‌ఖాన్, తాహెర్, మాధవి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

10 మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 9 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున, మరో వ్యక్తికి రూ. 1500 జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నూతన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి


లేబర్ చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: నూతన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరులోని జాతీయ రహదారిపై ఆయన నాయకులతో కలసి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన 4 కార్మిక లేబర్ చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం మార్చిందని ,వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇప్పటికే సుమారు 20 కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తోషిబా ఐఎన్‌టీయూసీ నాయకులు సంజీవ్, సుధాకర్, కిర్బీ ఐఎన్‌టీయూసీ నాయకులు జాన్సన్, విజయ్, ఏషియన్ పెయింట్స్ హమాలీ కార్మిక సంఘం నాయకులు రతన్‌సింగ్, అంబదాస్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు యువరాజ్ మోరే, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాధవీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా..

ఎమ్మెల్యే గాంధీ


మాధవీనగర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మాధవీనగర్‌కాలనీలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో త్వరలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. మంచినీటి సరఫరాలో సమయాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇఇ గోవర్ధన్, డీఈ రమేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు మహదేవ్, రవి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, జిల్లా గణేష్, కాశీనాద్ యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పటాన్‌చెరు టౌన్: పోషకాహారంతో ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ జయరాం నాయక్ అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిశోర బాలికలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీడీపీఓ జయరాం నాయక్ మాట్లాడుతూ... కిశోర బాలికలు రక్తహీనత రాకుండా చూసుకోవాలన్నారు. తల్లులు, గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు వాటి ప్రాముఖ్యతతో పాటు పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు.

పటాన్‌చెరు-సికింద్రాబాద్ బస్సు వేళలు..

రాయదుర్గం: హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో పటాన్‌చెరు–సికింద్రాబాద్ ఆర్డినరీ బస్సు రూట్ నంబర్–219 ఉదయం 5 గంటలకు బయలుదేరుతుంది. చివరి బస్సు రాత్రి 11 గంటలకు ఉంటుంది. ఇది పటాన్‌చెరు, ఇక్రిశాట్, ఆర్‌సీపురం, బీరంగూడ, అశోక్‌నగర్, లింగంపల్లి, చందానగర్, మదీనాగూడ, ఆల్విన్‌కాలనీ ఎక్స్‌రోడ్, మియాపూర్, నిజాంపేట్, జేఎన్‌టీయూ హెచ్, కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్డు, కూకట్‌పల్లి, ప్రశాంత్‌నగర్, బాలానగర్, శోభనా థియేటర్, బోయిన్‌పల్లి, తాడ్‌బంద్, ప్యాట్నీ సెంటర్ మీదుగా సికింద్రాబాద్ వరకు నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి 10 నిమిషాలకో బస్సు ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ డిపోమేనేజర్ మురళీధర్‌రెడ్డి సూచించారు.

కేవీపీఎస్ నూతన కమిటీ ఎన్నిక

చందానగర్: కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్ పేర్కొన్నారు. సోమవారం చందానగర్‌లోని పీజేఆర్ పార్కులో కేవీపీఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న వారందరికీ ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సత్యం, సంఘం గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాజు, సి రాజు, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, నరేష్, సభ్యులుగా శాంతయ్య, సునీత, నరసింహ, నరేష్ ,స్వామి వెంకటేశ్‌తో పాటు 14మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొంగరి కృష్ణ, సునీత, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌యస్ నాయకుల సమావేశం

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు బీఆర్‌యస్ భవన్‌లో శేరిలింగంపల్లి బీఆర్‌యస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసినగర్, ధరణినగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2, బూత్‌స్థాయిలో కంటెస్టెడ్ కార్పొరేటర్ సురభి రవీందర్‌రావు, డివిజన్ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో రెండు లక్షల మందిని నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమలలో సీనియర్ నాయకులు రామరాజు, నరసింహాచారి, కుమార్ యాదవ్, రామ్‌రెడ్డి, శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, చారి, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, రాయల్ ,రఘు, రమేష్, శివ, రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్.. ట్రాఫిక్

- ఆదివారం.. రాకపోకలకు ఆటంకం
- ప్రగతినగర్– జేఎన్‌టీయూ రోడ్డులో గంటల తరబడి జామ్


ప్రగతినగర్ చెరువు దారిలో వాహనాల రద్దీ

నిజాంపేట్: ఆదివారం వచ్చిందంటే చాలు.. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులకు నరకయాతన తప్పడం లేదు.. అర్జంట్ పనులపై బయటకు వెళ్లేవారు ట్రాఫిక్‌జామ్‌తో అసహనానికి గురవుతున్నారు.. చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారుల ఉదాసీనతతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఆదివారం వచ్చిందంటే నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ చెరువు రోడ్డులో పెద్ద సంఖ్యలో మాంసం, చేపల దుకాణాలు వెలుస్తున్నాయి. దీంతో కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించాలంటే భయపడే పరిస్థితి నెలకొంటోంది.

అనుమతి లేకుండా..

ఇబ్బడిముబ్బడిగా దుకాణాలు..

ప్రగతినగర్– జేఎన్‌టీయూరోడ్డు మార్గంలో చెరువు పక్క నుంచి కిలోమీటర్ మేర చేపలు, రొయ్యలు, మాంసం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రాకపోకలకు ఆటంకం కలిగే ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలంటే అధికారుల అనుమతి తప్పనిసరి. అనుమతి లేకుండానే దుకాణాలను యథేచ్ఛగా నడుపుతున్నారు. నిబంధనల ప్రకారం ఖాళీ ప్రదేశాల్లో వారాంతపు సంతలు, ఇతర వ్యాపారాలు నిర్వహించుకోవాలి. కానీ ప్రగతినగర్ చెరువు రోడ్డులో ఇవేమీ పాటించడం లేదు.

అత్యవసరమైతే ఇక అంతే..

ఎవరికైనా అత్యవసర పని ఉన్నా, అనారోగ్యం పాలైనా ఆదివారం ప్రగతినగర్ చెరువు గుండా జేఎన్‌టీయూకి వాహనంలో వచ్చారంటే ఇక అంతే సంగతులు.. ట్రాఫిక్ మధ్యలో ఇరుక్కుని ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక నానా అవస్థలు పడాల్సిందే. కూకట్‌పల్లి జేఎన్‌టీయూకి వెళ్లేందుకు ప్రగతినగర్ వాసులు ఈ మార్గాన్నే ఆశ్రయిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఈ రోడ్డు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంటోంది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, వాటి ముందు బారులు తీరిన వాహనాలతో రద్దీగా మారుతోంది. ఎదురుగా ఒకేసారి కార్లు వచ్చాయంటే గంటల తరబడి జామ్ అవుతోంది.

పట్టించుకోని ట్రాఫిక్, నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు..

ప్రగతినగర్ చెరువు ప్రాంతంలో ఆదివారం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో అటు కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు, ఇటు నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు తమ పరిధి కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. చెరువు మధ్య గుండా రోడ్డు ఉండటంతో ట్రాఫిక్‌లో ఇరుక్కుంటే ఇక వాహనదారులు విలవిలాడాల్సి వస్తోంది. ప్రతి ఆదివారం తలెత్తున్న ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు ఈ రోడ్డులో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్న దుకాణ సముదాయాలను ఖాళీ ప్రదేశాలలో ఏర్పాటు చేసేలా నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పనులు ముగిసినా.. వ్యర్థాలు అక్కడే..



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో కాంక్రీట్ అపార్టుమెంట్ చౌరస్తాలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి రెండు నెలలు కావస్తున్నా వ్యర్థాలను ఇంతవరకు తొలగించలేదు. ఇప్పటికైనా సీసీ వ్యర్థాలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

